నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 29 జూన్ 2024 | SURYAPET


ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళనంలో సూర్యాపేట జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు

కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయింది

● జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు

తుంగతుర్తి, జూన్ 28 : ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగందర్ రావు అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్ వంటి ఎన్నో అద్భుతమైన పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేని హామీలు ఇవ్వడంతో ప్రజలు మొగ్గు చూపి ఓటు వేశారని, ఓటు వేసిన జనం నేడు బాధపడుతున్నారని తెలిపారు. రానున్న సంవత్సరంకాలంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని పేర్కొన్నారు. కార్యకర్తలు ఐక్యతో పని చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుపొందేలా కృషి చేయాలని కోరారు. జీవితంలో పదవులు శాశ్వతం కాదని, పదవులు లేకున్నా ప్రజల వెంట ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములుగౌడ్, చెరుకు సృజనాపరమేశ్, కవిత, మంగి, తునికి సాయిలు, తునికి లక్ష్మమ్మ, గోపగాని శ్రీను, తడకమల్ల రవికుమార్, శ్రీకాంత్, గుడిపాటి రాజేశ్ పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గిన సందర్భంగా విజయ సంకేతం చూపుతున్న డైరెక్టర్లు

డీసీసీబీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

● 19 మందిలో 15 మంది హాజరు
● తాత్కాలిక చైర్మన్‌గా ఎన్నికైన వైస్ చైర్మన్ దయాకర్ రెడ్డి
● జూలై 1న డీసీఓ సమక్షంలో కొత్త చైర్మన్ ఎన్నిక

నల్లగొండ, జూలై 28 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై ప్రతిపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీసీసీబీలో శుక్రవారం డీసీఓ కిరణ్ కుమార్ సమక్షంలో జరిగిన అవిశ్వాస పరీక్షలో అనుకూలం కంటే వ్యతిరేక ఓట్లు ఎక్కువగా ఉండటంతో గొంగిడిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్టయ్యింది. ఉదయం 11 గంటలకు డీసీసీబీలో డీసీఓ కిరణ్ కుమార్ సమక్షంలో ఈ అవిశ్వాస పరీక్ష జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సహకార బ్యాంకు డైరెక్టర్లు మొత్తం 20 మంది ఉండగా అందులో ఒకటి ఖాళీ ఉంది. ఇక మిగిలిన 19 మందిలో చైర్మన్ మహేందర్‌రెడ్డితో పాటు అప్పిరెడ్డి, రంగాచారి, ప్రవీణ్ రెడ్డి మినహా 15 మంది డైరెక్టర్లు హాజరై చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు చేశారు. దాంతో ప్రతిపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లు డీసీఓ కిరణ్ కుమార్ ప్రకటించారు. అవిశ్వాసం నెగ్గడంతో వెంటనే చైర్మన్ కొత్త చైర్మన్ ఎన్నిక చేయలేనందున ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న ఎసిరెడ్డి దయాకర్ రెడ్డిని తాత్కాలిక చైర్మన్‌గా డీసీఓ నియమించారు. జూలై 1న కొత్త చైర్మన్‌ను ఎన్నుకోవడానికి సభ్యులందరూ హాజరు కావాలని సూచిస్తూ ఆయన వెంటనే అందరికీ నోటీసులు అందజేశారు. అప్పటి వరకు దయాకర్‌రెడ్డి తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. అవిశ్వాస ఘట్టం ముగిసిన అనంతరం కాంగ్రెస్ శ్రేణులు డీసీసీబీ వద్దకు చేరుకొని పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

నూతన చైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డి

కొత్త చైర్మన్‌గా కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకోనున్నారు. గడిచిన 15 రోజులుగా డైరెక్టర్లను క్యాంపునకు తీసుకెళ్లి అన్ని ఏర్పాట్లు చేసింది కూడా ఆయనే. కొత్తగా ఎన్నికైన చైర్మన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగనుండగా ప్రభుత్వం ఒకవేళ అదనపు సమయం ఇస్తే ఎక్కువ కాలం కూడా ఉండే అవకాశం ఉంది.

రైతు సంక్షేమం కోసం పాటుపడతాం : ఎసిరెడ్డి, కుంభం

డీసీసీబీలో అవిశ్వాసం నెగ్గిన అనంతరం తాత్కాలిక చైర్మన్‌గా ఎన్నికైన ఎసిరెడ్డి దయాకర్ రెడ్డితో పాటు కాబోయే కొత్త చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ పాలక వర్గానికి ఉన్న సమయంలో రైతు సంక్షేమం కోసం పాటుపడతామని ప్రకటించారు. ప్రభుత్వం అందజేసే ఫలాలు ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకుంటామని, పాలక వర్గం డైరెక్టర్ల సలహాలు, ఉద్యోగుల సహకారంతో ముందుకు పోతామని తెలిపారు.

ఎస్ఎల్‌బీసీని త్వరగా పూర్తి చేసేలా చర్యలు

● కలెక్టర్ నారాయణరెడ్డి
● ఎస్ఎల్‌బీసీ ఔట్‌లెట్, నక్కలగండి కట్ట నిర్మాణ పనుల పరిశీలన

చందంపేట, జూన్ 28 : ఎస్ఎల్‌బీసీ పనులను త్వరగా పూర్తి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. చందంపేట మండలంలోని మన్నెవారిపల్లి సమీపంలో చేపడుతున్న ఎస్ఎల్‌బీసీ ఔట్ లెట్ పనులతో పాటు నక్కలగండి కట్ట నిర్మాణ పనులను శుక్రవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏజెన్సీ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. ఈ టన్నెల్ ప్రపంచలోనే 5వ అతిపెద్ద టన్నెల్ కానుందని, 43.93 కిలోమీటర్ల మేర ఉన్న టన్నెల్ పనులు 30 కిలోమీటర్ల మేర పూర్తయినట్లు అధికారులు కలెక్టర్‌కు వెల్లడించారు. 4వేల క్యూసెక్కుల నీటిని తీసుకెళ్లే సామర్థ్యంతో టన్నెల్ నిర్మాణం జరుగుతున్నాయని, టన్నెల్ పూర్తి చేసేందుకు ప్రస్తుతం రూ.4,658.59 కోట్లు అంచనా వ్యయం పెరిగినట్లు అధికారులు వివరించారు. డ్రిల్లింగ్ మిషన్ టీబీఎం పనితీరు తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. టన్నెల్-2 నుంచి సుమారు కిలోమీటర్ మేర ట్రాక్ ద్వారా లోపలికి వెళ్లి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తెల్దేవర్‌పల్లి గ్రామ పరిధిలోని మోత్యతండా సమీపంలో చేపడుతున్న నక్కలగండి కట్ట నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కట్ట నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులను ఆదేశించారు. భూ నిర్వాసితులకు తగిన న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పూర్తయితే నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో సుమారు 3లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీటి సమస్య తీరనుందని చెప్పారు. అంతకు ముందు ఆయన కోరుట్ల సమీపంలో ఉన్న బేస్ క్యాంప్ వద్ద ప్రాజెక్టు ప్రతినిధులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.సత్యనారాయణ, డీఈలు బి.చక్రపాణి, లలిత, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మహేందర్, రవిరాజ్, జయప్రకాశ్, జయప్రకాశ్ అసోసియేషన్ లిమిటెడ్ ప్రాజెక్ట్ ఏజెన్సీ ఏజీఎంలు దీపక్‌జైన్, వీరేందర్ సింగ్, ఎంపీపీ పార్వతీచందునాయక్, తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ లక్ష్మి, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, రూరల్ సీఐ సురేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లచ్చిరాంనాయక్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు వద్ద ఇంజినీర్లతో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

బీమా చెక్కు అందజేత

మఠంపల్లి, జూన్ 28 : మండలంలోని జాన్మూతండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త భూక్యా కృష్ణనాయక్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మరణించాడు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కు మంజూరైంది. శుక్రవారం సూర్యాపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ కష్ణానాయక్ కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.


బీమా చెక్కు అందిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్

శివన్నగూడెం ప్రాజెక్టు నిర్వాసితులకు త్వరలో ప్లాట్లు

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మర్రిగూడ, జూన్ 28 : శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఏరియాలో విలువైన పాట్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాతానన్నారు. మండలంలోని వెంకెపల్లి, వెంకెపల్లి తండా, నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇబ్రహీంపట్నంలో సాధ్యపడకపోతే జిల్లాలోని చింతపల్లితోపాటు పలు ప్రాంతాల్లో ప్లాట్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తనకు రెండు నెలలు గడువు ఇవ్వాలని, ఈ లోపు ప్రభుత్వంతో చర్చలు జరిపి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూ నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. అప్పటివరకు నర్సిరెడ్డిగూడెం గ్రామస్తులు పనులకు సహకరించాలని కోరారు. రోడ్డును తొలగించి కట్టను నిర్ణీత ఎత్తు వరకే నిర్మిస్తారని, దాంతో వర్షం నీరు గ్రామంలో నిలిచే అవకాశం లేదని ఇంజినీర్లు చెప్పినట్లు వెల్లడించారు. పనులు ఆపితేనే నష్టపరిహారం వస్తుందనుకుంటే పొరపాటని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టు నిర్మాణం 90శాతం పూర్తయిందని, ప్రభుత్వంతో కొట్లాడైనా రెండు మూడేండ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తానని తెలిపారు.

శివన్నగూడెం ప్రాజెక్టు నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

ప్లాట్లు ఇచ్చాకే రోడ్డును తొలగించండి : నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులు

ముందుగా ప్లాట్లు ఇచ్చిన తర్వాతే గ్రామానికి వచ్చే రోడ్డును తొలగించి కట్ట పనులు చేపట్టాలని నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. రోడ్డు తొలగించి కట్ట నిర్మాణం చేపడితే గ్రామం ముంపునకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూ నష్టపరిహారం అందని వాళ్లు ఇంకా ఉన్నారని వాపోయారు. పునరావాసం కల్పించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఇండ్లలోకి నీళ్లు రానివ్వమని, ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం, ప్లాట్లను అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ రాములు నాయక్, ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ తదితరులు ఉన్నారు.

రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ● డిండి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

డిండి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

డిండి, జూన్ 28 : రైతులు నీటిని పొదుపుగా వాడుకొని అధిక దిగుబడులు సాధించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరందించే కుడి, ఎడమ కాల్వలకు శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఆయన నీటిని విడుదల చేశారు. అనంతరం బాలూనాయక్ రైతులతో ముచ్చటించారు. ప్రభుత్వం నీటి పారుదల, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయనున్నట్లు, రైతు భరోసా కింద ఎకరాకు రూ.7,500చొప్పున రెండు విడుతలు కలిపి రూ.15,000 ఇవ్వనున్నట్లు చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీని సందర్శించి టన్నెల్ పనులు పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీతాజనార్దన్‌రావు, జడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీధర్‌రావు, డీఈ శ్రీనివాస్, ఏఈ ఫయాజ్, వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ప్యాకింగ్ లైసెన్స్ తీసుకోకుంటే కఠిన చర్యలు

● జిల్లా తూనికలు, కొలతల అధికారి రామకృష్ణ

నల్లగొండ రూరల్, జూన్ 28 : కిరాణా దుకాణాల్లో నిత్యావసర సరుకులు సొంతంగా ప్యాకింగ్ చేసి తమ బ్రాండ్‌గా విక్రయించరాదని, ఇలా చేయాలంటే తప్పకుండా ప్యాకింగ్ లైసెన్స్ తీసుకోవాలని జిల్లా తూనికలు, కొలతల అధికారి పి.రామకృష్ణ సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కిరాణ షాపులపై ఫిర్యాదు నేపథ్యంలో శుక్రవారం ఆయన దేవరకొండ మండలంలోని పలు కిరాణ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. రూ.1.80 లక్షల జరిమానా విధించి 9 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కిరాణా దుకాణాల్లో ప్యాకేజీలపై మ్యానుఫ్యాక్చరింగ్, అడ్రస్, ఎమ్మార్పీ, డేట్ ఆఫ్ మ్యానుఫ్యాక్చరింగ్ లేకపోవడాన్ని గుర్తించామన్నారు. దాంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దుకాణాల్లో డిక్లరేషన్ లేని ప్యాకేజీలు అమ్మరాదని, అటువంటివి తనిఖీల్లో దొరికినట్లయితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్యాకింగ్ చేసే వారు విధిగా ప్యాకింగ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వినియోగదారులు ఎటువంటి ఫిర్యాదులు ఉన్నా లీగల్ మెట్రాలజీ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని, 9010651783 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

దేవరకొండలోని కిరాణ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారి రామకృష్ణ

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ముగిసిన వివాదం

● దవాఖాన వర్గాల అభ్యంతరాలపై కలెక్టర్ సమీక్ష
● అభ్యంతరాలపై చర్చకు అదనపు కలెక్టర్‌కు ఆదేశాలు
● అదనపు కలెక్టర్ పూర్ణచంద్రతో వైద్యుల బృందం చర్చలు
● ఆర్ఎంఓతో కలిపి పర్యవేక్షణకు ఓకే చెప్పిన వైద్యులు
● మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా పనిచేద్దామని ప్రకటన

నీలగిరి, జూన్ 28 : గత రెండు రోజులుగా నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకున్న వివాదం సమసిపోయింది. కలెక్టర్ సి.నారాయణరెడ్డి చొరవ తీసుకుని ఆస్పత్రి పర్యవేక్షణకు సంబంధించిన అంశాలపై స్పష్టత ఇవ్వడంతో గందరగోళానికి తెరపడింది. కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర వైద్యుల బృందాలతో అభ్యంతరాలపై చర్చలు జరిపారు. జిల్లా ఆస్పత్రిపై పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం ఉద్దేశాన్ని అదనపు కలెక్టర్ వైద్య బృందానికి వివరించారు. దీంతో తమ అభ్యంతరాలపై ఉన్న అనుమానాలు నివృత్తి కావడంతో వైద్యబృందం సైతం పర్యవేక్షణకు ఓకే చెప్తూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా తమ కృషి ఉంటుందని చెప్పడంతో కథ సుఖాంతమైంది.

చర్చలు సఫలం..

గురువారం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలతో శుక్రవారం అదనపు కలెక్టర్, ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బందితో జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. శుక్రవారం నలుగురు సభ్యులతో కూడిన నల్లగొండ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు, తెలంగాణ డాక్టర్ల బోధన సిబ్బంది అసోసియేషన్ బృందం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్రను ఆయన ఛాంబర్‌లో కలిసి చర్చలు జరిపారు. అనంతరం అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర చర్చల వివరాలను ఆయన వెల్లడించారు. శుక్రవారం నల్లగొండ వైద్య కళాశాల నుంచి ఇద్దరు, తెలంగాణ డాక్టర్ల బోధన సిబ్బంది అసోసియేషన్‌కు చెందిన ఖమ్మం, సూర్యాపేట వైద్య కళాశాలల నుంచి వచ్చిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల బృందం తన దగ్గరికి వచ్చిందని, నల్లగొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని అధికారులతో తనిఖీ చేయించే విషయం తనతో చర్చించారని, చర్చల సందర్భంగా జిల్లా అధికారులతో ప్రధానాస్పత్రిని దవాఖాన పర్యవేక్షకులు ఏర్పాటు చేసిన ఒక ఆర్ఎంఓతో కలిపి తనిఖీ చేసేందుకు తమకు అభ్యంతరం లేదని వారు ఒప్పుకున్నారని తెలిపారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విషయంలో అందరూ కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. చర్చల ప్రకారం జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎంపిక చేసిన ఆర్ఎంఓతో కలిసి రేపటి నుంచి జిల్లా అధికారులు యథావిధిగా ప్రజలకు అవసరమైన పరిపాలనపరమైన విభాగాలను తనిఖీ చేస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో చర్చలు జరిపిన వారిలో నల్గొండ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.శ్రీకాంత్ వర్మ, ఎల్.రమేశ్, ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ డాక్టర్ల బోధన సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, జోనల్ కార్యదర్శి, సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ గిరిధర్ నాయక్, జీజీహెచ్ పర్యవేక్షకుడు నిత్యానందం ఉన్నారు.

ప్రతి రోజూ విభాగాల వారీగా పరిశీలన

నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు అందాల్సిన మెరుగైన వైద్యసేవలు, ఇతర సౌకర్యాలపై ఇతర శాఖలకు చెందిన అధికారులు, మెడికల్ కళాశాల ఆర్ఎంఓతో కలిసి నిత్య పర్యవేక్షణ చేయనున్నారు. దవాఖానలో ముఖ్యమైన వార్డుల్లో పారిశుద్ధ్యం, టాయిలెట్స్, తాగునీరు, రేడియాలజీకి సంబంధించి ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, సీటీ స్కానింగ్, ఈసీజీ వార్డుల్లో లోటుపాట్లు పరిశీలిస్తారు. అలాగే రోగుల భోజనం సంబంధించి వంటగది శుభ్రంగా ఉందా లేదా పరిశీలిస్తారు. భోజనానికి వాడుతున్న కిరాణా సామగ్రి, కూరగాయలు, పప్పు దినుసులు వంటివి తాజాగా ఉన్నది లేనిది చూస్తారు. ఓపీలో ఆరోజు అప్పటివరకు ఎంతమంది వచ్చారు, డాక్టర్లు వారిని చూసి పంపడానికి ఎంత సమయం తీసుకుంటున్నది, అవసరమైన రోగులకు వీల్ చైర్లు, స్ట్రెచర్ వంటివి ఏర్పాటు చేసేందుకు సిబ్బంది సహాయకుల పనితీరును పర్యవేక్షించనున్నారు.

నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం ధర్నా చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

ఉదయం నిరసన.. మధ్యాహ్నం విరమణ

జిల్లా యంత్రాంగం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అత్యవసర సేవలు మినహాయించి అన్ని రకాల విధులు బహిష్కరించి శుక్రవారం ఉదయం రెండోరోజు వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సుమారు రెండుగంటలపాటు ఆందోళన చేయగా కలెక్టర్ ఆదేశాలతో ఆస్పత్రి సూపరింటెండెంట్ వైద్యులు, సిబ్బంది ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ ఆందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్రతో చర్చలు జరిపారు. జిల్లా యంత్రాంగం తీసుకున్న నిర్ణయాలు, జిల్లా అధికారులకు ఇచ్చిన ఆదేశాలను వారికి వివరించారు. డాక్టర్లకు ఉన్న అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. దీంతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని వారు చెప్పారు. డాక్టర్లు చేపట్టిన ఆందోళనను విరమిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు.